తెలుగు దినపత్రిక
# డైలీ రిపోర్ట్
DAILY REPORT




సంపుటి: 1 సంచిక: 133 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ శుక్రవారం 13-12-2024 వెల: 5/రూ -

# ఏపీని నెం.1గా నిలబెడతాం

ఉద్యోగాల కల్పనకే ప్రథమ ప్రాధాన్యం

పరిశ్రమల అనుమతులపై అలసత్వం వద్దు

సానుకూల వాతావరణం కల్పించాలి

పారిశ్రామికాభివృద్ధిపై కలెక్టర్లకు

ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి: ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలిస్తామని ప్రజలకు హామీ ఇచ్చామని, ఉద్యోగాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యమిచ్చి పని చేయాలని

మిగతా 2లో



2లో

## భరణం నిర్ణయించడానికి 8 సూత్రాలు

విడాకుల కేసు నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పు

దేశవ్యాప్తంగా కోర్టులకు దిశానిర్దేశం

బెంగళూరు టెకీ ఆత్మహత్యతో కీలకంగా మారిన 'భరణం'

# కేంద్రం సాయం చేసేలా సహకరించం

గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సత్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



రూ.1.63 లక్షల కోట్ల ప్రాజెక్టులపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో సీఎం రేవంత్

రాష్ట్రంలోని వివిధ

ప్రాజెక్టులపై చర్చ

ఆర్‌ఆర్‌ఆర్, మెట్రో ఫేజ్-2 తదితరాల ప్రస్తావన

కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, ధర్మేంద్ర ప్రధాన్‌లతోనూ భేటీ

న్యూఢిల్లీ: తెలంగాణలో వివిధ రకాల అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం సహకరించేలా కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి సంబంధించి మొత్తం రూ. 1,63,559.31 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేంద్రం నుంచి కావల్సిన చేయూతపై కిషన్‌రెడ్డితో చర్చించారు. ట్రిపుల్ ఆర్, హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2తో పాటు హైదరాబాద్, వరంగల్‌లో సీవరేజీ, భూగర్భ డ్రైనేజీ, సింగరేణి సంస్థకు బొగ్గు గనుల కేటాయింపు సహా పలు అంశాలను ప్రస్తావించారు. రాజస్తాన్‌లోని జైపూర్‌లో ఓ వివాహ కార్యక్రమానికి హాజరై ఢిల్లీ వచ్చిన సీఎం..

మిగతా 2లో



# జగజ్జేత మన గుకేశ్

ప్రపంచ చెస్ చాంపియన్‌గా దొమ్మరాజు గుకేశ్

18 ఏళ్లకే వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన భారత గ్రాండ్‌మాస్టర్

చివరి గేమ్‌లో డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌పై గెలుపు

ఓవరాల్‌గా 7.5%-%6.5 పాయింట్ల తేడాతో టైటిల్ కైవసం

విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనత సాధించిన భారత ఆటగాడిగా గుర్తింపు

అద్భుతం జరగడంలో కొన్నిసార్లు ఆలస్యం కావచ్చు... కానీ అసలు సమయంలో అలాంటి అద్భుతాన్ని ఎవరూ ఆపలేరు! ఒకటి కాదు... రెండు కాదు... కనీసం మూడుసార్లు దొమ్మరాజు గుకేశ్‌కు విజయావకాశాలు వచ్చాయి... కానీ దురదృష్టవశాత్తూ త్రుటిలో అతను వాటిని చేజార్చుకున్నాడు. మరోవైపు ప్రత్యర్థి కూడా మూడుసార్లు పైచేయి సాధించి గెలుపుపై కన్నేసినా... బలంగా నిలబడ్డాడు.

- మిగతా 2వ పేజీలో



# జమిలికి సై

లోక్‌సభ, అన్ని అసెంబ్లీలకు ఒకేసారి పోలింగ్

రెండు సవరణ బిల్లులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

వచ్చేవారమే పార్లమెంటులో ప్రవేశపెట్టే చాన్స్.. వెంటనే జేపీసీకి వెళ్తుందంటున్న బీజేపీ వర్గాలు

2 బిల్లులను పార్లమెంటు ఆమోదిస్తే చాలు.. తొలిబిల్లుకు ఉభయసభల్లో 2/3 మెజారిటీ అవసరం

స్థానిక సంస్థలను చేర్చే ఆలోచనకు విరామం

సగం రాష్ట్రాల ఆమోదం అవసరమవడం వల్లే..

బిల్లులను చూసి స్పందిస్తామన్న కాంగ్రెస్

జమిలి కన్నా పెద్ద సమస్యలున్నాయని వ్యాఖ్య

2లో

# మిలిటెంట్ తరహాలో ముందుకు..

మళ్లీ ఉద్యమం తరహా వ్యూహాలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పదును



కాంగ్రెస్ ప్రభుత్వానికి తగినంత సమయం ఇచ్చామనే భావన

జనం స్పందనకు అనుగుణంగా పార్టీ కార్యాచరణ

బీజేపీ వైపు జనం మొగ్గుచూపడం లేదనే అభిప్రాయం

అసెంబ్లీ స్పీకర్‌పై అవసరమైతే వాయిదా తీర్మానం

ఫిబ్రవరి నెలాఖరులో పార్టీ సత్తా చాటేలా భారీ బహిరంగ సభ

వచ్చే ఏడాదంతా పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టాలని నిర్ణయం

ప్రెస్‌మీట్లు, ప్రకటనలే కాకుండా..జనంలోకి నేరుగా వెళ్లాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగించాలని సూచన

2లో

హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏడాది పాలన పూర్తయిన నేపథ్యంలో ఇకపై దూకుడుగా పోరాటాలు చేపట్టా లని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నిర్ణయించింది. కొత్త ప్రభుత్వం కుదురుకుని పనిచేసేందుకు సరిపడా సమయం ఇచ్చా మని భావిస్తోంది. ఇక ముందు పూర్తిస్థాయిలో ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని.. ఒకవైపు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, మరోవైపు పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు చేసిన మంచిని వివరించాలని నిర్ణయించింది.



## ప్రభుత్వ ఆస్పత్రుల్లో తనిఖీకి టాస్క్‌ఫోర్స్

పరికరాలు, మందుల లభ్యత, ఫైర్ సేఫ్టీ తదితరాల తనిఖీ

నిర్లక్ష్య అధికారులపై కొరడా

నిర్దేశిత సమయంలో పరికరాలకు రిపేర్లు చేయకపోతే కాంట్రాక్టర్‌పై చర్యలు

మంత్రి రాజనర్సింహ వెల్లడి



## భరణం నిర్ణయించడానికి 8 సూత్రాలు

న్యూఢిల్లీ: విడాకుల అనంతరం మహిళకు ఇచ్చే 'భరణం' విషయమై సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ప్రవీణ్ కుమార్ జైన్, అంజు జైన్ దంపతుల విడాకుల కేసును విచారించిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న వి వర్లేలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రవీణ్ కుమార్ జైన్ తన భార్యకు భరణం కింద రూ.5 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. ఈ సందర్భంగా మహిళకు జీవనభృతిని నిర్ణయించడానికి ముందు ఎనిమిది అంశాలను రూపొందించింది. దేశవ్యాప్తంగా అన్ని కోర్టులు భరణం కోసం తమ ఆదేశాలను ప్రాతిపదికగా తీసుకోవాలని సూచించింది.ప్రవీణ్ అంజు జైన్ విడాకుల కేసులో తీర్పు వెలువరించిన ధర్మాసనం తన పెద్ద కుమారుడి పోషణ, ఆర్థిక భద్రత కోసం కోటి రూపాయలు కేటాయించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. పెళ్లయిన తర్వాత ఆరేళ్ల పాటు కలిసి ఉన్న ఈ జంట ఆ తర్వాత 20 ఏళ్లు విడివిడిగా ఉంటున్నారు. వీరిద్దరి మధ్య విభేదాలు, విభేదాలు తలెత్తాయనే ఆరోపణలు వీరి పెళ్లికి కారణమయ్యాయి. అంజు హైపర్ సెన్సిటివ్ అని, ఆమె తన కుటుంబంతో నిర్లక్ష్యంగా వ్యవహరించేదని ప్రవీణ్ ఆరోపించారు. మరోవైపు ప్రవీణ్ ప్రవర్తన తన పట్ల సరిగా లేదని అంజు ఆరోపించింది. ఇంతకాలం విడివిడిగా ఉంటున్న ఈ జంట కేసులో పెళ్లికి అర్థం, అనుబంధం, బంధం పూర్తిగా తెగిపోయాయని కోర్టు అభిప్రా యపడింది. ఆ తర్వాత షరతులను పేర్కొంటూ కో ర్టు విడాకులకు ఆమోదం తెలిపింది. భార్య తనపై తప్పుడు కేసు పెట్టిందంటూ బెంగళూరు టెక్కీ అతుల్ సుభాష్ ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో ఈ భరణం ఆర్డర్ చర్చనీయాంశమైంది.

### కోర్టు సూచించిన ఎనిమిది సూత్రాలు

1. భార్యాభర్తల సామాజిక, ఆర్థిక స్థితిగతులు
2. భవిష్యత్తులో భార్యాపిల్లల ప్రాథమిక అవసరాలు
3. ఇరుపక్షాల అర్హత, ఉద్యోగం
4. ఆదాయ మార్గాలు, ఆస్తులు
5. అత్తవారింట్లో ఉంటూ భార్య జీవన ప్రమాణాలు
6. కుటుంబ పోషణ కోసం ఆమె ఉద్యోగాన్ని వదిలేసిందా?
7. ఉద్యోగం చేయని భార్యకు న్యాయపోరాటానికి సహేతుకమైన మొత్తం
8. మెయింటెనెన్స్ అలవెన్స్‌తో పాటు భర్త ఆర్థిక స్థితి, అతని సంపాదన, ఇతర బాధ్యతలు

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో తనిఖీకి టాస్క్‌ఫోర్స్



(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రు ల్లో పరికరాలు, మందుల లభ్యత, ఫైర్ సేఫ్టీ తదితరాలను తనిఖీ చేసేందుకు ప్రత్యేకంగా పది టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేయాలని వైద్య, ఆరో గ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ బృందాలు క్రమం తప్పకుండా ఆస్పత్రులను సందర్శించి నివేదిక ఇవ్వాలన్నారు. గురువారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో ఆయన శాఖ ఉన్నాధికారులతో సమావేశం నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ బృందాలను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఆస్పత్రుల తీరు ను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా సెంట్రలైజ్డ్ ఇంటిగ్రేటెడ్ మానిటరింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రస్థాయి నుంచి మండల స్థాయిలో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు పర్యవేక్షణ సాగేలా నూతన వ్యవస్థ అందుబాటులోకి తేవాలని చెప్పారు. దీనిపై త్వర లో సెంట్రల్ పోర్టల్‌ను అందుబాటులోకి తేనున్న ట్లు పేర్కొన్నారు. ఎక్విప్‌మెంట్ స్థాయిని బట్టి రెండు నుంచి నాలుగు రోజుల్లో రిపేర్లు పూర్తి చేయాలన్నారు. నిర్దేశించిన సమయంలో పరికరాలకు రిపేర్లు చేయకపోతే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. రాష్ట్ర విభజన సమయంలో బయోమెడికల్ ఇంజనీర్ పోస్టులు ఏపీకి వెళ్లాయని, ఈ పదేళ్లలో బయోమెడికల్ ఇంజనీర్లనునియమించకపోవడంతో చిన్న చిన్న రిపేర్ల కోసమూ ప్రైవేటు వ్యక్తులపై ఆధారపడాల్సి వస్తోందని అధికారులు రాజనర్సింహకు వివరించారు. రాష్ట్రస్థాయిలో చీఫ్ బయోమెడికల్ ఇంజనీర్ పోస్ట్ క్రియేట్ చేయాలని మంత్రి ఆదేశించారు. పతీ జిల్లాకు కనీసం ఒక బయోమెడికల్ ఇంజనీర్ ను తాత్కాలిక పద్ధతిలో నియమించుకోవాలన్నా రు. కొంతమంది సిబ్బంది ఉద్దేశపూర్వకంగా మిషన్లను రిపేర్‌లో పెడుతున్నారని అధికారులు వివరించగా... అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మందుల సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారిపై కొరడా ఝుళిపించాలన్నారు. ఎక్స్‌పైరీ తేదీ కంటే 3 నెలల ముందే మెడిసిన్‌ను వినియోగించాలని, లేని పక్షంలో వెనక్కి పంపించాలన్నారు. సెంట్రల్ మెడిసినల్ స్టోర్లు, హాస్పిటల్ ఫార్మసీ స్టోర్లలో రెగ్యులర్‌గా తనిఖీలు చేయాలన్నారు. పలు హాస్పిటల్స్‌లో ఫైర్ అలారమ్స్, స్మోక్ డిటెక్టర్స్ సరిగా లేవని గుర్తించామని, నాలుగైదు సంవత్సరాలుగా నిర్వహణ సరిగా లేదని అధికారులు వివరించారు. ఫైర్ సేఫ్టీ విషయంలో అజాగ్రత్త వద్దని, ప్రతి హాస్పి టల్‌లో అవసరమైనమేర అలారమ్, స్మోక్ డిటెక్టర్స్, మంటలను ఆర్పే యంత్రాలను అందుబాటులో ఉంచాలని రాజనర్సింహ ఆదేశించారు.

# జమిలికి సై

న్యూఢిల్లీ: జమిలి ఎన్నికల దిశగా కేంద్ర ప్రభుత్వం కీలకమైన ముందడుగు వేసింది. లోక్‌సభకు, దేశంలోని అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన రెండు బిల్లులకు గురువారం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వచ్చే వారం మొదటి రెండు రోజుల్లో పార్లమెంటు ఉభయ సభల్లో బిల్లులను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. రెండు బిల్లుల్లో మొదటిది లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లు కాగా, రెండోది శాసనసభలున్న కేంద్ర పాలిత ప్రాంతాలైన ఢిల్లీ, పుదుచ్చేరి, జమ్మూ కశ్మీర్‌లకు ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు ఉద్దేశించిన సాధారణ బిల్లు. పార్లమెంటు ఉభయ సభల్లో కేవలం సాధారణ మెజారిటీ ఉన్న ఎన్డీయే ప్రభుత్వం రాజ్యాంగ సవరణ బిల్లును నెగ్గించుకోవాలంటే తప్పనిసరిగా అద్భుతం చేయాలి. లేదా విపక్షాల సహకారాన్ని తీసుకోవాలి. ఈ విషయంలో చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం గురువారం నాటి క్యాబినెట్ సమావేశానికి సంబంధించి ఎలాంటి బ్రీఫింగ్ ఇవ్వలేదు. నోట్ కూడా విడుదల చేయలేదు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కేవలం ఉభయ సభల్లో బిల్లులను ప్రవేశపెట్టి, వెంటనే సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) పరిశీలనకు పంపుతారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి.జమిలి ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే విషయంపైనా స్పష్టతనివ్వలేదు. తదుపరి సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా జమిలి ఎన్నికల రూపంలోనే జరుగుతాయని పార్టీ వర్గాలు తెలిపాయి. ఒకే దేశం ఒకే ఎన్నికల దిశగా ఎంతోకొంత ముందుకు వెళ్లాలని కృత నిశ్చయంతో ఉన్న ప్రభుత్వం ఇందుకు జేపీసీ మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈసారి పంచాయతీ, మునిసిపల్ ఎన్నికల విషయంలో మాత్రం కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోలేదు. స్థానిక ఎన్నికలను తర్వాత దశలో పరిశీలిస్తారని బీజేపీ వర్గాలు తెలిపాయి. జమిలి కోసం మొత్తం ఆరు బిల్లులు పెట్టాల్సి ఉండగా ప్రస్తుతం రెండింటికే పరిమితం అవుతున్నారు. తర్వాత దశల్లో అవి కూడా వీటికి జత చేరతాయని అంటున్నారు. తొలి బిల్లులో రాజ్యాంగంలోని ఆర్టికల్ 83(పార్లమెంటు కాలపరిమితి), ఆర్టికల్ 172(అసెంబ్లీ కాలపరిమితి)లను సవరిస్తారు. ఇందుకు ఉభయ సభల్లో హాజరైన సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది సభ్యుల మద్దతు అవసరం. లోక్‌సభలో మూడింట రెండు వంతులు అంటే 361 మంది సభ్యుల మద్దతు కావాలి. ఎన్డీయే కూటమి బలం 293 మాత్రమే. వైసీ పీ, బీజేడీ, అన్నాడీఎంకే మద్దతు ఇచ్చినా 2/3 చేరుకోవడం అసాధ్యం. రాజ్యసభలోనూ 154 మంది ఎంపీల మద్దతు కావాలి. ఎన్డీయే బలం నామినేటెడ్ సభ్యులు కలుపుకొని 119 మాత్రమే. అంటే, ఉభయ సభల్లో బిల్లు నెగ్గడం అంత తేలికేమీ కాదని చెబుతున్నారు.లోక్‌సభ, అసెంబ్లీలకు మాత్రమే జమిలి ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించాల్సిన అవసరం ఉండదని కేంద్రం భావిస్తోంది. స్థానిక ఎన్నికలను వాటితోపాటు కలిపితే కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీల్లోనైనా అమోదం పొందాల్సి ఉంటుందని బీజేపీ వర్గాలు అంటున్నాయి. ప్రస్తుతం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలపైనే పూర్తి దృష్టి కేంద్రీకరించాలని మోదీ ప్రభుత్వం భావిస్తున్నట్టు ఈ వర్గాలు తెలిపాయి. మూడు నెలల క్రితం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సమర్పించిన నివేదికలో లోక్‌సభ, అసెంబ్లీలతో పాటు స్థానిక సంస్థలకూ ఒకేసారి ఎన్నికలు జరపాలని, దేశవ్యాప్తంగా ఒకే ఓటర్ల జాబి తా రూపొందించాలని సిఫారసు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలను కూడా చేర్చాలంటే 324(ఎ) పేరుతో ఆర్టికల్‌ను చేర్చాలని చెప్పింది. దీనికి సగం రాష్ట్రాల శాసనసభల ఆమోదం అవసరం. దీన్ని ప్రస్తుతానికి పక్కనబెట్టారు. కోవింద్ కమిటీ మూడు రాజ్యాంగ అధికరణలకు, మూడు చట్టాలకు కలిపి మొత్తం 18 సవరణలు సూచించింది. ప్రభుత్వ పాల న సాఫీగా జరగడానికి జమిలి ఎన్నికలు అవసరమని తాము భావిస్తున్నట్టు బీజేపీ చీఫ్ విఫ్ సంజ య్ జైశ్వాల్ తెలిపారు. ప్రతి కొద్ది నెలలకు ఎన్నికలు జరగడం వల్ల ప్రభుత్వ సమర్థత తగ్గిపోతుందని, అధికారులు, రాజకీయ నాయకులు నిరంతరం ఎన్నిక ల ప్రక్రియలో తలమునకలై ఉంటారని, సంక్షేమ పథకాలు అమలు చేయడం సాధ్యం కాదని జైశ్వాల్ చెప్పారు.జమిలిని ప్రవేశపెడితే ఐదేళ్ల పాటు పాలన సాఫీగా సాగుతుందని ఆయన ఒక జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. 1971 వరకు జమిలి ఎన్నికలు నిరాటంకంగా జరిగాయ ని, తర్వాతే వాటికి అంతరాయం కలిగింద న్నారు. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడాన్ని 30కి పైగా పార్టీలు సమర్థిస్తున్నాయి. కాంగ్రెస్ సహా మరో 15 పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ ప్రతిపాదన ఆచరణాత్మమైనది కాదని కాంగ్రెస్ అంటోంది. జమిలి ప్రజాస్వామ్య వ్యతిరేకమ ని, ప్రాంతీయ ఆకాంక్షలకు గొంతు లేకుండా పోతుందని, సమాఖ్య వ్యవస్థ దెబ్బతింటుందని తమిళనాడు సీఎం, డీఎంకే అధినేత స్టాలిన్ వ్యాఖ్యానించారు. జమిలిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత మమతా బెనర్జీ కూడా జమిలిని వ్యతిరేకించారు.

## మిలిటెంట్ తరహాలో ముందుకు..

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని.. బీఆర్‌ఎస్ దీనిని అనుకూలంగా మలుచుకోవాలని నేతలు, కార్యకర్తలకు పార్టీ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. రాబోయే రోజుల్లో పార్టీ కేడర్‌ను, ప్రజలను భాగస్వాములను చేస్తూ రేవంత్ ప్రభుత్వం తీరుపై 'మిలిటెంట్ తరహా దూకుడు పోరాటాలు చేయాల'ని ఇటీవల జరిగిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల భేటీలో సూచించినట్టు తెలిసింది. కాంగ్రెస్ విధానాలను నిరంతరం విమర్శించడం వల్ల అధికారం కోల్పోయాననే బాధతో విమర్శలు చేస్తున్నట్టుగా ప్రజలు భావించే అవకాశం ఉందని కేసీఆర్ అభిప్రాయపడినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే దూరదృష్టితో పదేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, వాటి అమలు వెనుక ఉన్న తాత్వికతను కూడా ప్రజలకు విడమరిచి చెప్పాలని సూచించినట్టు సమా చారం. "హైదరాబాద్‌లో భారీ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి అనుమతులివ్వడం ఇక్కడి ఆర్థిక పటిష్టతను ప్రజలకు చాటి చెప్పాం. ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ఉన్న అవకాశాలను దృష్టిలో పెట్టుకుని భారీ ఫార్మాసిటీ ఏర్పాటుకు భూసేకరణ చేశాం. గత ప్రభుత్వం తీసుకున్న ప్రతీ నిర్ణయం వెనుక అనేక శాస్త్రీయ కోణాలు ఉన్నాయి. వాటిని సామాన్యులకు కూడా అర్థమయ్యే రీతిలో అసెంబ్లీలో, బయటా పార్టీ నేతలు విడమరిచి చెప్పాలి.."అని పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో కేసీఆర్ పేర్కొన్నట్టు తెలిసింది.పభుత్వ తప్పులను ఎండగట్టడం, పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం కేవలం ప్రెస్‌మీట్లు, పత్రికా ప్రకటనలకు పరిమితం కాకుండా... సోషల్ మీడియాను విస్తృతంగా వాడుకోవాలని సూచించినట్టు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తు న్న ప్రజా వ్యతిరేకత బీజేపీకి అనుకూలంగా ఏమీ మారడం లేదని, దీనిని బీఆర్‌ఎస్ అందిపుచ్చుకోవాలని పేర్కొన్నట్టు సమాచారంఅసెంబ్లీ వేదికగా ఒత్తిడి పెంచి..: అసెంబ్లీ శీతాకాల సమావేశాలను వేదికగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని బీఆర్‌ఎస్ భావిస్తోంది. తొలిరోజున అదానీ%-%రేవంత్ దోస్తీ అంటూ టీషర్టులు ధరించి అసెంబ్లీకి వచ్చిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు.. సభ జరిగే మిగతా రోజుల్లోనూ ఏదో ఒకరకమైన వ్యూహంతో అసెంబ్లీకి వచ్చి ప్రజల్లో చర్చ జరిగేలా చేయాలని నిర్ణయానికి వచ్చి నట్టు తెలిసింది. పార్టీ ఫిరాయింపుల అంశంపై స్పీకర్ అనుసరిస్తున్న వైఖరిని ప్రశ్నిస్తూ వాయిదా తీర్మానం ఇవ్వడం, లేదా స్వల్పకాలిక చర్చకు పట్టుబట్టడం దిశగా ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. ఇక కాంగ్రెస్ ఇచ్చిన 6గ్యారంటీలకు అసెంబ్లీతో చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో ఒత్తిడి తీసుకురావాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఈసారి అసెంబ్లీ సమావేశాలకు మాజీ సీఎం, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ హాజరైనా ఎలాంటి చర్చల్లో పాల్గొనే అవకాశం లేదని సమాచారం. అసెంబ్లీ సమావేశాలు ముగిశాక బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లాల్లో పర్యటించనున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## ఏపీని నెం.1గా నిలబెడతాం

ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రెండోరోజు జరిగిన కలెక్టర్ల సదస్సులో పరిశ్రమల శాఖపై సమీక్ష నిర్వహించారు. జిల్లాల్లో ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారో ఆ వివరాలతో వచ్చే కలెక్టర్ల సమావేశానికి రావాలని, ఆన్‌లైన్ పోర్టల్‌లో కూడా వివరాలు నమోదు చేయాలని చంద్రబాబు సూచించారు. జిల్లాల్లో కలెక్టర్ల అధ్యక్షతన డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ (డీఐఈపీసీ) సమావేశాలను సక్రమంగా నిర్వహించకపోవడం పట్ల సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. చిత్తూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఈ ఏడాదిలో ఒక్క సమావేశం కూడా నిర్వహించకపోవడం సరికాదన్నారు. కృష్ణా జిల్లాలో 5 సమావేశాలు నిర్వహించగా.. ఇతర జిల్లాల్లో అంతకన్నా తక్కువ నిర్వహించారన్నారు. 'పశు సంవర్ధక శాఖ, సీఆర్‌డీఏ, ఈడీబీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఉన్నత విద్య, హౌసింగ్, పెట్టుబడులు-మౌలిక సదుపాయాలు, ఐటీ-ఎలక్ట్రానిక్స్, మున్సిపల్, మైనింగ్, నెడ్‌క్యాప్, రోడ్లు-భవనాలు, స్కిల్ డెవలప్‌మెంట్, టూరిజం తదితర శాఖల ద్వారా కొత్తగా ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉంది. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి స్ట్రీమ్‌లైన్ చేస్తే ఉద్యోగాలు వస్తాయి. జిల్లాల్లో ఎన్ని పెట్టుబడులు పెట్టారు? ఎన్ని ఉద్యోగాలు కల్పించామనే దానిపై ప్రత్యేక దృష్టి సారించి, అందుకనుగుణంగా పనిచేయాలి' అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు."ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త' నినాదంతో జిల్లాల్లో విరివిగా పరిశ్రమలను ప్రోత్సహించాలి. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కుల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలి. భూసేకరణలో రైతులను భాగస్వాములను చేయాలి. రైతులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని, మిగిలిన భూములు అమ్ముతామన్నా అభ్యంతరం లేదు. అమరావతి రాజధాని కోసం భూసేకరణ ఏవిధంగా చేశామో.. అదే విధంగా పీ4 మోడల్‌లో పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ చేయాలి. అంతిమంగా పరిశ్రమలకు భూములిచ్చిన రైతులకు లబ్ధి చేకూరాలి. ఉదాహరణకు నక్కపల్లి దగ్గర ఆర్సిలర్ మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీ రాబోతోంది. ఆ ప్రాంతం ఒక టౌన్‌షిపగా అభివృద్ధి చెందుతుంది. త్వరలో రామాయపట్నంలో బీపీసీఎల్ ఆయిల్ రిఫైనరీ వచ్చే అవకాశం ఉంది. వీటి కోసం భూములను త్యాగం చేసే రైతులకు అక్కడే ప్రయోజనం చేకూర్చాలి. రాష్ట్రంలో ఇప్పటికే దాదాపు 30 లక్షల ఎంఎస్ఎంఈలు ఉన్నాయి. వీటిలో కొన్ని బాగాలేవు.

# జగజ్జేత మన గుకేశ్

(మొదటి పేజీ తరువాయి)

సింగపూర్: భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ కొత్త ప్రపంచ చెస్ చాంపియన్‌గా ఆవిర్భవించాడు. 18 ఏళ్ల వయసులోనే విశ్వ విజేతగా నిలిచి ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు. క్లాసికల్ ఫార్మాట్‌లో డిఫెండింగ్ చాంపియన్, చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్‌తో జరిగిన 14 గేమ్‌ల పోరులో గుకేశ్ 7.5%-%6.5 పాయింట్ల తేడాతో విజయం సాధించాడు. 13 గేమ్‌లు ముగిసేసరికి ఇద్దరూ 6.5%-%6.5 పాయింట్లతో సమంగా ఉండగా నిర్ణాయక చివరి పోరులో గుకేశ్ తన సత్తాను ప్రదర్శించాడు. 58 ఎత్తుల్లో లిరెన్ ఆట కట్టించి విజయనాదం చేశాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో క్యాండిడేట్స్ టోర్నీ గెలుచుకొని వరల్డ్ చాంపియన్‌కు సవాల్ విసిరేందుకు సిద్ధమైన రోజు నుంచి గుకేశ్‌పై అంచనాలు పెరిగాయి. నవంబర్ 25 నుంచి మొదలైన ఈ సమరంలో 9 గేమ్‌లు 'డ్రా'గానే ముగిశాయి. గురువారం చివరి గేమ్‌కు ముందు చెరో రెండు గేమ్‌లు గెలిచిన ఇద్దరూ సమంగా ఉన్నారు. ఈ గేమ్ కూడా 'డ్రా' అయితే 'టైబ్రేక్' ద్వారా విజేతను నిర్ణయించాల్సి వచ్చేది. కానీ గుకేశ్ ఆ అవకాశం ఇవ్వలేదు. తన అత్యుత్తమ ఆటను ప్రదర్శించి లిరెన్‌ను పడగొట్టాడు. తద్వారా క్లాసికల్ విభాగంలో దిగ్గజ ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్ (2012) తర్వాత వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన భారత ప్లేయర్‌గా గుకేశ్ నిలిచాడు.

**చివరి పోరు సాగిందిలా...**

తెల్లపావులతో ఆడిన 32 ఏళ్ల లిరెన్ కింగ్స్ ఇండియన్ అటాక్ ఓపెనింగ్‌తో ఆటను మొదలు పెట్టగా... గ్రన్‌ఫీల్డ్ వేరియేషన్‌తో గుకేశ్ బదులిచ్చాడు. ఈ గేమ్ కూడా 'డ్రా' అయితే తన బలమైన ర్యాపిడ్‌లో గుకేశ్ ఆట కట్టించవచ్చని భావించిన లిరెన్ ఈసారి కూడా దూకుడు ప్రదర్శించకుండా రక్షణాత్మకంగా నే ఆడాడు. ఇక మరో 'డ్రా' ఖాయం అనిపించింది. ఈ దశలో లిరెన్ చేసిన భారీ తప్పిదం తన టైటిల్ కోల్పోయేలా చేసింది. తన 55వ ఎత్తులో అతను రూక్‌ను ఎఫ్2 గడిలోకి పంపించాడు. ఆశ్చర్యంతో గుకేశ్ కళ్లు ఒక్కసారిగా మెరిశాయి! కాస్త మంచినీళ్లు తాగిన అనంతరం గుకేశ్ తన ప్రత్యర్థి ఆట కట్టించేందుకు ఎన్ని ఎత్తులు అవసరమో ప్రశాంతంగా ఆలోచించుకున్నాడు. ఆపై ఎంతో సమయం పట్టలేదు. తన 58వ ఎత్తులో కింగ్‌ను ఇ5 గడిలోకి పంపడంతో లిరెన్‌కు ఓటమిని అంగీకరించడం మినహా మరో మార్గం లేకపోయింది. రష్యా దిగ్గజం గ్యారీ కాస్పరోవ్ పేరిట 39 ఏళ్లుగా ఉన్న రికార్డును భారత గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ బద్దలు కొట్టాడు.

## కేంద్రం సాయం చేసేలా సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

గురువారం సాయంత్రం కిషన్‌రెడ్డితో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. ఈ భేటీల్లో ముఖ్యమంత్రితో పాటు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు మల్లురవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, బలరాం నాయక్, కడియం కావ్య, గడ్డం వంశీ, సురేశ్ షెట్కార్, అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.34,367.62 కోట్లు. ఆర్‌ఆర్‌ఆర్‌తో పాటు రేడియల్ రోడ్లు పూర్తయితే ఫార్మా పరిశ్రమలు, ఇండ్రస్టియల్ హబ్‌లు, లాజిస్టిక్ పార్కులు, రిక్రియేషన్ పార్కులు వంటివి అభివృద్ధి అవుతాయి. ఆర్‌ఆర్‌ఆర్‌కు సంబంధించి వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అనుమతులన్నీ ఇప్పించేందుకు కృషి చేయండి.మధ్య మొత్తం 76.4 కి.మీ మేర నిర్మించనున్న మెట్రో రైలు నిర్మాణానికి రూ.24,269 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశాం.




# క్రికెట్ అకాడమీ ఏర్పాటుతో క్రీడాకారుల్లో కొత్త ఆశలు

## బెల్లంపల్లిలో క్రికెట్ అకాడమీ ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభం

**బెల్లంపల్లి, డిసెంబర్ 12 (డైలీ రిపోర్ట్ ):**క్రికెట్ అకాడమీ ఏర్పాటుతో క్రీడాకారుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. బెల్లంపల్లి పట్టణంలో శుక్రవారం రోజున మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీని స్థానిక శాసన సభ్యులు గడ్డం వినోద్ ప్రారంభించానున్నారు. రైల్వే స్టేషన్ సమీపంలో ఈ అకాడమీని ఏర్పాటు చేస్తున్నారు. కొంత కాలంగా క్రికెట్ క్రీడాకారులకు సరైన శిక్షణ లభించడం లేదన్న కారణంగా తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ బాధ్యులు పైడిమల్ల నర్సింగ్, అల్లం వెంకటేశ్వర్లు, జాడి శేఖర్, గౌతమ్, రాజేష్ గౌడ్, రాజేష్ అహోరాత్రులు కష్టపడి ఈ అకాడమీ ఏర్పాటులో సఫలీకృతం అయ్యారు. సబ్ జూనియర్ స్థాయి నుండి సీనియర్ స్థాయి వరకు ఈ అకాడమీలో శిక్షణ ఇవ్వడానికి తగిన ఏర్పాట్లు చేశారు. నిపుణులైన శిక్షకులతో ఔత్సాహిక క్రీడాకారులకు మంచి శిక్షణ ఇచ్చి వారిని రాష్ట్ర, దేశ స్థాయిలో మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అకాడమీ నిర్వాహకులు తెలిపారు.






## సీఎం కప్ గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే: కాలే యాదయ్య

**శంకర్పల్లి డిసెంబర్ 12:(డైలీ రిపోర్టర్):** మొయినాబాద్ మండలం , శంకర్ పల్లి మండలలకు సంబంధించిన మండల స్థాయి సీ.ఎం కప్ ఆటలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసిన స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య . ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి వారితో పాటు నాయకులు షాబాద్ దర్శన్, వేణుగోపాల్,లక్ష్మణ్,మహేందర్ ముదిరాజ్, రామ్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రాఘవరెడ్డి, రాజు గౌడ్, ప్రవీణ్, వివిధ స్కూల్ విద్యార్థులు,ఉపాధ్యాయులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సిధారెడ్డి ఆరోపణలు అర్ధరహితం - శిల్పి రమణారెడ్డి



**సిద్ధిపేట (డైలీ రిపోర్ట్) , డిసెంబర్ 12 :** సాహిత్య అకాడమి మాజీ చైర్మెన్ నందిని సిధారెడ్డి ఆరోపణలు అర్ధరాహితమని ప్రముఖ చిత్రకారుడు , శిల్పి రమణారెడ్డి చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో తనపై సిధారెడ్డి మూర?పు ఆరోపణలు చేస్తున్నాడని విమర్శించారు. గురువారం నాడు సిద్ధిపేట ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాకారులను అగౌరవపరుస్తూ కళను డబ్బుతో ముడిపెట్టడం దారుణమన్నారు. డబ్బు కోసమే కళాకారుడు ఉన్నట్టు ఆరోపణలు చేయటం సమంజసంగా లేదన్నారు. విద్యావేత్త , పెద్దమనిషి అయిన సిధారెడ్డి దిగాజారుడు మాటలు మాట్లాడవద్దని హితవు పలికారు. గత ప్రభుత్వంలో అధికారహోదాలను అనుభవించి, డబ్బుల్లో మునిగి తేలిన ఆయన అదే అహంకారంతో మాట్లాడుతున్నారని విమర్షించారు. గత ప్రభుత్వ హయాంలో తాను ఏ పదవులు గానీ , ప్రభుత్వ ఉద్యోగం గానీ చేయలేదన్న విషయాన్ని సిధారెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. ఓ కళాకారుడిగా ఆత్మగౌరవం , ఆత్మాభిమానంతో తాను పనిచేస్తానని రమణారెడ్డి చెప్పారు. తెలంగాణ తల్లి రూపకల్పనకు కళాకారుడిగా కోట్లు తీసుకున్నాననే అరోపణను రుజువుచేయాలని లేదంటే పత్రికా ముఖంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గత పాలకులకు ఊడిగం చేసిన సిధారెడ్డి మేధస్సు వికటించినట్టుందని ఎద్దేవా చేశారు. ఈ విలేఖరుల సమావేశంలో సిద్ధిపేట పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## శంకర్‌పల్లి: ఈనెల 15న శ్రీ పాతాళ త్రికోణ మహాసుందరి ఆలయంలో కుబేర భైరవి హెూమం

**శంకర్పల్లి డిసెంబర్ 12:(డైలీ రిపోర్ట్):** ఈనెల 15న పౌర్ణమి సందర్భంగా శంకర్‌పల్లి మండల పర్వేద అనుబంధ గ్రామమైన కొత్త గూడలో గల శ్రీ పాతాళ త్రికోణ మహా సుందరి ఆలయంలో కుబేర భైరవి (చివరి భాగం) మహా హెూమం ఉంటుందని ఆలయ చైర్మన్ మాధవరెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించగలరని కోరారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

## శంకర్‌పల్లి మాజీ సర్పంచ్ ఆత్మలింగంను సన్మానించిన మరకత శివాలయ ఆల్ ఇండియా ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ రాజు



**శంకర్‌పల్లి డిసెంబర్ 12:(డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మాజీ సర్పంచ్ సాత ఆత్మలింగం ను గురువారం శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయ ఆల్ ఇండియా ప్రచార కమిటీ చైర్మన్ దయాకర రాజు స్వామి ఆయనను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా దయాకర్ రాజు మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధి కొరకు ఆత్మలింగం ఎనలేని కృషి చేశారని కొనియాడారు. సమాజ శ్రేయస్సు కొరకు మాజీ సర్పంచ్ మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని దయాకర్ రాజు స్వామి శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివుడిని కోరుకున్నారు. ఆత్మలింగం అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు ముందుకు నడవాలని చైర్మన్ పిలుపునిచ్చారు. పలువురు దాతలు కూడా ముందుకు వచ్చి ఆలయాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని మాజీ సర్పంచ్ కోరారు. అనంతరం స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించి, తీర్థ ప్రసాదాలను చైర్మన్.. మాజీ సర్పంచ్ కు అందజేశారు.

## శంకర్‌పల్లి నుంచి శబరిమలకు మూడు ప్రత్యేక రైళ్లు

**శంకర్‌పల్లి డిసెంబర్ 12:(డైలీ రిపోర్ట్):** అయ్యప్ప భక్తుల కోసం జనవరి ఫిబ్రవరిలో శబరిమలకు శంకర్‌పల్లి రైల్వే స్టేషన్ నుంచి మూడు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. 2025 జనవరి 7, 14, 21, 28 తేదీలలో హైదరాబాద్ - కొట్టాయం (07065), (07135), (07163) 8, 15, 22, 29 తేదీల్లో కొట్టాయం - సికింద్రాబాద్ (07066), (07136), (07164) ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. హైదరాబాద్, బేగంపేట్, లింగంపల్లి, శంకర్‌పల్లి, వికారాబాద్, తాండూర్, సేడం, యాదగిర్, కృష్ణ, రాయచూర్, మంత్రాలయం, ఆదోని, గుంతకల్, గుత్తి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, జొలార్ పెట్టై, సేలం, ఎరోడ్, తిరుపూర్, కోయంబత్తూర్, పాలక్కాడ్, త్రిశూర్, అలువ, ఎర్నాకులం, కొట్టాయం స్టేషన్ లలో ఆగుతాయని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.




# ప్రకృతి విపత్తుల నిధులను పక్కదారి పట్టించిన గత వైకాపా ప్రభుత్వం

## ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆరోపణ.

## పార్లమెంటు సాక్షిగా వైఎస్ఆర్సీపీ ఎంపీలకు దీటైన సమాధానం చెప్పిన ఎంపీ మహేష్ కుమార్

**ఢిల్లీ/ ఏలూరు డిసెంబరు 12:(డైలీ రిపోర్ట్):** ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో ప్రజలను ఆదుకోవడంలో గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అలాగే నిధులను పెద్ద ఎత్తున పక్కదారి పట్టించిందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆరోపించారు. విపత్తు నిర్వహణ సవరణ బిల్లు 2024 ఆమోదం సందర్భంగా గురువారం లోక్ సభలో జరిగిన చర్చ సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వం బుడమేరు అభివృద్ధిని విస్మరించడం వల్లే సెప్టెంబర్ లో కురిసిన వర్షాలకు విజయవాడ మునిగిపోయిందని ఎంపీ ప్రస్తావించారు. విజయవాడ వరదల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాధితులకు అండగా నిలిచారని, తమ కూటమి ప్రభుత్వం తక్షణం సహాయక చర్యలు చేపట్టడమే కాకుండా, సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పర్యవేక్షించారని, బాధితులకు పరిహారం అందించిన తర్వాతే చంద్రబాబు ఇంటికి వెళ్లారని, రెండు వారాలపాటు దగ్గరుండి చంద్రబాబు పర్యవేక్షించారని ఎంపీ మహేష్ కుమార్ తెలిపారు. వైఎస్ఆర్సిపి ప్రజా ప్రతినిధులు మాత్రం తమ ప్రభుత్వంపై బురదజల్లే విధంగా లోక్ సభలో మాట్లాడి సభను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని ఎంపీ మహేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుడమేరు అభివృద్ధికి సంబంధించిన నిధులు, ప్రకృతి విపత్తులకు సంబంధించిన నిధులను కూడా గత వైకాపా ప్రభుత్వం పక్కదారి పట్టించడమే కాకుండా జేబులు నింపుకున్నారని ఎంపీ మహేష్ కుమార్ ధ్వజమెత్తారు. గతంలో హుద్ హుద్ తుఫాన్ సమయంలో కూడా అల్లకల్లోలమైన విశాఖపట్నంను తిరిగి పునరుద్ధరించడమే కాకుండా బాధితులకు అవసరమైన సహాయక చర్యలు చంద్రబాబు నాయుడు సమర్థవంతంగా చేపట్టిన విషయాన్ని ఎంపీ మహేష్ కుమార్ గుర్తు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా గోదావరి నదికి వరదలు పోటెత్తి, పెదవాగుకు గండి పడి




వేలేరుపాడు మండలం ముంపునకు గురైన సందర్భంలో కూడా తమ కూటమి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టి, సాధారణ పరిస్థితులు వచ్చేవరకు పర్యవేక్షించి, బాధితులకు అండగా నిలిచిందని ఎంపీ తెలిపారు.

# పోలీసులపై మోహన్ బాబు సంచలన కామెంట్స్

ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన మోహన్ బాబు మరో ఆడియో సందేశం రిలీజ్ చేశారు. ఈ ఘటన జరిగినందుకు తాను ఎంతో చింతిస్తున్నట్లు ఆడియో సందేశమిచ్చారు. మొదట తాను నమస్కారం పెట్టానని.. అయినప్పటికీ అతను మైక్ పెట్టాడని అన్నారు. జర్నలిస్టును కొట్టాలనే ఉద్దేశం తనకు లేదని తెలిపారు. మీడియాపై దాడి ఘటనపై మోహన్ బాబు వివరణ ఇచ్చారు. %నా కన్నుకు మైక్ తగలబోయిందని.. తృటిలో తప్పించుకున్నానని మోహన్ బాబు వెల్లడించారు. ఇలా మీడియా ప్రతినిధులపై దాడి చేయాల్సి వస్తుందని తానెప్పుడూ ఊహించలేదన్నారు. నిజ జీవితంలో నటించాల్సిన అవసరం తనకు లేదన్నారు. నా ఇంటి గేట్లు బద్దలు కొట్టి లోపలికి రావడం న్యాయమేనా?అని ప్రశ్నించారు. నేను చేసింది న్యాయమా? అన్యాయమా? అనేది ప్రజలు, నాయకులు ఆలోచించాలని మోహన్ బాబు కోరారు.నా ఇంట్లోకి వచ్చింది మీడియా వాళ్లు అవునో, కాదో తనకు తెలియదని మోహన్ బాబు చెప్పారు. నా ఇంటి లోపలికి వచ్చి ఏకాగ్రత, ప్రశాంతతను భగ్నం చేశారని అన్నారు. ఆవేశంలో తాను కొట్టిన దెబ్బ అతనికి తగిలిందని.. ఈ ఘటనకు బాధపడుతున్నానని వివరించారు. జర్నలిస్టును కొట్టాలని ఆ దేవుడి సాక్షిగా తాను అనుకోలేదని మోహన్ బాబు వెల్లడించారు. మా కుటుంబ సమస్యకు మధ్యవర్తులు అవసరం లేదని.. నా పిల్లలతో కలిసి తామే పరిష్కరించుకుంటామని తెలిపారు.పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మోహన్ బాబు ఆరోపించారు. పోలీసుల ప్రవర్తనను ప్రజలంతా గమనించాలని మోహన్ బాబు విజ్ఞప్తి చేశారు. ఎవరి కుటుంబంలోనైనా ఇలాంటి గొడవలు సహజమేనని ఆడియో సందేశంలో మాట్లాడారు.





# బయ్యారం స్టీల్ ప్లాంట్ ఇక లేనట్లేనా?

హైదరాబాద్ : బీజేపీ తెలంగాణ పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి, ప్రేమ ఉన్నా తక్షణమే బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ కవిత డిమాండ్ చేశారు.%బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు, తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌కు ముడి ఇనుము నిల్వల కేటాయింపుపై లోక్ సభలో చర్చ జరిగింది. ఆ చర్చ సందర్భంగా కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడంపై కీలక వ్యాఖలు చేశారు. కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కవిత ఎక్స్ వేదికగా స్పందించారు.

# కొడుకు రాసిన మరణశాసనం.. వెంట పేగుబంధం!

## ఆత్మహత్యకు యత్నించిన కుటుంబం మృత్యువాత

## ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒక్కొక్కరుగా నలుగురూ మృతి

## కాసిపేట గ్రామంలో తీవ్ర విషాదం

తాండూర్: ఆన్‌లైన్ ట్రేడింగ్ ఆ ఇంటిల్లిపాది పాలిట మృత్యుపాశమైంది. అనతికాలంలోనే డబ్బు సంపాదించాలనే కుమారుడి అత్యాశ.. కుటుంబం బలవన్మరణానికి కారణమైంది. మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలోని కాసిపేట గ్రామానికి చెందిన సముద్రాల శివప్రసాద్ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి నష్టపోవడం, అప్పులు అధికం కావడం, అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి తట్టుకోలేక కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం శీతల పానీయంలో గడ్డి మందు కలుపుకొని తాగిన విషయం తెలిసిందే. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంలో శివప్రసాద్(26)తోపాటు తల్లిదండ్రులు మొండయ్య(58), శ్రీదేవి(52), అక్క చైతన్య అలియాస్ చిట్టి(30) ఒక్కొక్కరుగా గంటల వ్యవధిలో నలుగురూ బుధవారం మృతిచెందారు.

**యూట్యూబ్‌కు ఆకర్శితుడై..**

శివప్రసాద్ బెల్లంపల్లిలో కొంతకాలం ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేశాడు. గత ఏడాదిన్నర కాలంగా యూట్యూబ్ ద్వారా ఆన్‌లైన్ ట్రేడింగ్ వైపు ఆకర్శితుడయ్యాడు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాడు. తొలుత కాస్త లాభాలు ఆర్జించాడు. ఆ తర్వాత వరుసగా నష్టాలు రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డాడు. తెలిసిన వారి వద్ద అప్పులు చేయడంతో వడ్డీలు పెరిగి భారమయ్యాయి.

**రూ.50 లక్షలకు పైగా..**

అప్పులు పెరిగిపోవడంతో ఏడాది క్రితం కొంతకాలం శివప్రసాద్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడడం, స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడంతో అప్పులు రూ.50లక్షలకు పైగా పెరిగిపోయాయి. బ్యాంకు రుణాల పేరుతో మరికొంత అప్పు చేయడంతో మోయలేని భారమైంది. అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరిగిపోవడంతో తీవ్ర మానసిక క్షోభకు గురయ్యాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చే దారిలేక కుటుంబంతో కలిసి ఆత్మహత్యకు యత్నించినట్లు తెలుస్తోంది.చైతన్య పుట్టుకతోనే దివ్యాంగురాలు కావడంతో తల్లిదండ్రులు అల్లారుముద్దుగా పెంచారు. మరొకరి సాయం ఉంటే గానీ జీవనం సాగించలేని పరిస్థితి కావడంతో దగ్గరుండి చూసుకునేవారు.

# కంది జైల్లో ఉన్న నేరస్తునికి గుండెపోటు



సంగారెడ్డి అర్బన్, డిసెంబర్ 12: లగచర్ల సంఘటనలో అరెస్టు అయిన రైతు ఈర్య నాయక్‌కు హార్ట్ ఎటాక్ వచ్చింది. బుధవారం రాత్రి ఛాతిలో నొప్పి రావడంతో..సంగారెడ్డి లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అతనికి హార్ట్ ఎటాక్ వచ్చిందని ధృవీకరించారు వైద్యులు. ఈరోజు ఆ రైతుని నిమ్స్ ఆసుపత్రికి తరలించనున్నారని సమాచారం.

# ఆలయ నిర్మాణానికి విరాళం అందజేసిన పి ఎ సి ఎస్ డైరెక్టర్: కాడిగారి రాజశేఖర్ రెడ్డి



**శంకర్పల్లి డిసెంబర్ 12:(డైలీ రిపోర్ట్)::** శంకర్పల్లి మండలం లక్ష్మారెడ్డి గూడ గ్రామంలో శ్రీ హనుమాన్ మందిర్ నిర్మాణానికి తన వంతుగా లక్ష ఐదువేల రూపాయలు(1,05,000) గ్రామ పెద్దలకు అందజేయడం జరిగింది. దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి తోడుపడగలరణి రాజశేఖర్ రెడ్డి కోరారు.

# అత్యవసర సర్క్యులర్



ఈనెల 13న MRPS అనుబంధం సంఘుల సమావేశం గద్వాల జిల్లా కేంద్రంలో విజయవంతం చేద్దాం.స్థలం గద్వాల తేది:13-12-2024

సమయం: ఉదయం 12 గంటలకు MRPS MSP మరియు అన్ని అనుబంధ సంఘాల సంస్థ గత నిర్మాణాలను బలోపేతం చేద్దాం.మన జాతి అధినేత గౌరవ శ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు MRPSμμ *MSP MSF MEF VHPS MJF MMS% అన్ని అనుబంధ సంఘాల సంస్థ గత నిర్మాణాలను చేపట్టడానికై నూతన కార్యచరణకు జిల్లా సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా

MRPS తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ గారు పాల్గొంటారులికావున MSP MRPS మరియు అనుబంధం సంఘాల జాతీయ రాష్ట్ర మరియు జిల్లా, సీనియర్ నాయకత్వం, వివిధ మండలాల నాయకత్వం, గా|గ్రామాలలో ఉన్న నూతన నాయకత్వం అందరు తప్పనిసరిగా పాల్గొనాలని కోరుతున్నాను సామాజిక ఉద్యమ నమస్కారాలతో గువ్వలదిన్నెజంబయ్య మాదిగ MRPS కే టి దొడ్డి మండల ఇంచార్జి.

# కాంగ్రెస్‌ను చంపేస్తారా?.. ఏఐసీసీ కార్యదర్శిపై జగ్గారెడ్డి ఫైర్

హైదరాబాద్: ఏఐసీసీ కార్యదర్శి విష్ణుపై పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు. ఇన్‌ఛార్జ్‌లు పార్టీని చంపేయాలని చూస్తున్నారా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రాత్రి ఓ ఫంక్షన్‌లో ఏఐసీసీ కార్యదర్శిపై ఆయన మాటల దాడి చేశారు. ఇంతకీ మీరు ఏఐసీసీ కార్యదర్శిగా ఉన్నారా..? వేరే రాష్ట్రం వెళ్ళిపోయారా..? అంటూ జగ్గారెడ్డి ప్రశ్నించారు,

%మెదక్ జిల్లా కూడా నేనే చూస్తున్నానంటూ విష్ణు చెప్పగా, పార్టీ ఇన్‌ఛార్జ్ దీపా దాస్ మున్షీ కూడా ఉన్నారా.. వేరే రాష్ట్రం పోయారా..?. అధికార పార్టీ అంటే ఎలా ఉండాలి? మీరేం చేస్తున్నారో అర్థం అవుతుందా? అంటూ జగ్గారెడ్డి నిలదీశారు. కొత్త వాళ్లకు పదవులు సిఫార్సు చేస్తున్నారు. వారు ఫైనల్ అయ్యే వరకు కూడా మాకు తెలియడం లేదంటూ కార్యదర్శికి జగ్గారెడ్డి ధ్వజమెత్తారు.



Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707